08022024-DIS-04_Layout 1 2/8/2024 2:50 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ప్రజాస్వామ్యానికే మచ్చ

ప్రజాస్వామ్యానికి ఓటు మూలాధారం. ప్రజల అభిమతం తెలిపే పవిత్రమైన పత్రం బ్యాలెట్. ఆ పత్రం అపవిత్రమైపోయింది. స్వేచ్ఛ, పారదర్శకత గాలికెగిరిపోయాయి. బ్యాలెట్‌లో నిక్షిప్తమైన తీర్పు తారుమారైంది. నిష్పాక్షిక దృష్టితో ఎన్నికలను పర్యవేక్షించాల్సిన ప్రిసైడింగ్ అధికారి స్వయంగా అక్రమాలకు పాల్పడటం, ఎన్నిక ఫలితాలను తిమ్మిని బమ్మిని చేయడం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. సర్వోన్నత న్యాయస్థానికి వెళ్తే గానీ దారిమళ్లింపునకు గురైన ఓటుకు ఊరట లభించలేదు. భారతీయ ఎన్నికల వ్యవస్థకు పెను మచ్చలాంటి ఈ ఘటన పంజాబ్-హర్యానా ఉమ్మడి రాజధాని నగరమైన చండీగఢ్‌లో జరిగింది. ఈ కేసులో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ఎన్నికల నిర్వహణ వ్యవస్థ లొసుగులపైకి దృష్టి మళ్లిస్తున్నాయి.

చండీగఢ్ మేయర్ ఎన్నిక సందర్భంగా ప్రిసైడింగ్ అధికారి కొన్ని బ్యాలెట్లను కొట్టివేయడం, వాటిని అనర్హమైనవిగా ప్రకటించడంపై దుమారం చెలరేగిన విషయం విదితమే. ఆప్, కాంగ్రెస్ కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్ మేయర్ పదవికి ఎన్నికైనట్టు ప్రకటించడం వివాదానికి దారితీసింది. అందుకు ఎనిమిది ఓట్లను చెల్లనివిగా ప్రకటించిన ప్రిసైడింగ్ అధికారి అనిల్ మసీహ్‌పై సుప్రీంకోర్టు మండిపడింది. బీజేపీకి చెందిన నామినేటెడ్ సభ్యుడైన మసీహ్ ఆప్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు చెందిన ఎనిమిది ఓట్లను కొట్టివేయడం సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది. సదరు వీడియోను వీక్షించిన సుప్రీంకోర్టు ధర్మాసనం 'ఇది దుర్భర ఉదంతం' అని దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 'ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు' అని స్వయంగా ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ పేర్కొనడం గమనార్హం. అంతేకాకుండా అక్రమానికి పాల్పడిన ప్రిసైడింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని, తదుపరి విచారణ రోజు కోర్టు ముందు హాజరుకావాలని ఆదేశించడం ఈ వ్యవహారాన్ని న్యాయస్థానం తీవ్రంగా పరిగణిస్తున్నదనడానికి నిదర్శనం.

కేవలం 35 మంది ఎన్నికైన కౌన్సిలర్లు, ఒక పార్లమెంట్ సభ్యుడు పాల్గొనే ఎన్నికను చేతులెత్తడం ద్వారా కాకుండా రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించడమే పలు సందేహాలకు తావిచ్చింది. బహుశా క్రాస్ ఓటింగ్ జరుగుతుందేమో అని బీజేపీ ఆశించి ఉండవచ్చు. కానీ, అలాంటిదేమీ జరగలేదు. ఓట్లు పక్కాగా పోలవడంతో ప్రిసైడింగ్ ఆఫీసర్ మసీహ్ తన చేతివాటాన్ని చూపించారు. పదేపదే సీసీటీవీ కెమెరాల వైపు చూస్తూ బ్యాలెట్లపై ఆయన గీతలు గీశారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన ఈ దృశ్యాలను పరిశీలించిన సుప్రీంకోర్టు 'మేం అంతా గమనిస్తున్నామని గుర్తుంచుకోండి' అని తాఖీదు ఇవ్వడం ఈ వ్యవహారంలో హైలైట్. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నదని, ముఖ్యంగా ఓటింగ్‌కు ఉపయోగించే ఈవీఎం యంత్రాలను తారుమారు చేస్తున్నదని విపక్షాలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆరోపణల్లో నిజానిజాలు ఏ మేరకు ఉన్నాయనేది అలా ఉంచితే, చండీగఢ్‌లో ఎన్నికల అక్రమానికి ఒడిగట్టింది కేంద్రంలోని పాలక బీజేపీకి చెందిన నేత కావడం ఆ పార్టీ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తున్నది. రెండు విడతల అధికారాన్ని చేజిక్కించుకొని, మూడో విడతకు అంగలు వేస్తున్న పార్టీకి చండీగఢ్ తరహా ఎన్నికల అక్రమాలు శోభించవు. కొన్ని ప్రత్యేకమైన నియమ, నిబంధనలకు లోబడి ఆడాల్సిన ప్రజాస్వామ్య క్రీడలో తొండి జరగడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామిక దేశంలో ఓటు అపహాస్యానికి, అపనమ్మకానికి గురికావడం ఏమాత్రం శ్రేయస్కరం కాదు.

కొట్టినా పడాలె.. తిట్టినా పడాలె

వర్ధెల్లి వెంకటేశ్వర్లు

ఇప్పుడొకసారి చరిత్రను తొవ్వుకోవాలె. ఎప్పుడో జీవచ్ఛవాలుగా మారిన వాళ్ల అవశేషాల గురించి కాదు. ఏనాడో శిథిలమైపోయిన ఆనవాళ్ల కోసం కానే కాదు. తెలంగాణకు విముక్తి కలిగించిందెవరు? ఎవరు పోరాడారు? ఎవరు గెలిచారు? అని కూడా కాదు. పంటచేల మీది పాత ముచ్చట్లను తలుచుకోవటానికి.. అక్కడి నులివెచ్చని జ్ఞాపకాలను తడుముకోవటానికి చరిత్రను తొవ్వుకోవాలె. ఉమ్మడి ఏలుబడిలో ధ్వంసమైపోయిన సాగుబడిని.. లుప్తమైన సంస్కృతిని తరచిచూసి ఎదలు బాదుకోవటానికి తొవ్వాలె. పాలకులకు దిశచూపి.. పంటచేనుకు జీవం పోసే సరికొత్త సాగు పంచాంగం కోసం మన చరిత్రను మనమే తొవ్వుకోవాలె.

సూర్యాపేట జిల్లా కర్విరాల కొత్తగూడెంలో పది రోజుల కిందట మా పెదనాన్న వర్ధెల్లి రాములు తన 79వ యేట అమరుడయ్యాడు. సాగుబాటుతో పాటు తిరుగుబాటు కూడా జీవన గమనంలో ఓ భాగమేనని చెప్పిన మలితరం మార్క్సిస్టు ఆయన. 'లెఫ్ట్ రైట్ అనే సిద్ధాంతాన్ని నమ్మారాయన. తన తమ్ముళ్లనే సైన్యంగా చేసుకొని దొరతనానికి వ్యతిరేకంగా దండు నడిపిన అసలుసిసలైన కమ్యూనిస్టు వర్ధెల్లి రాములు. రెక్కల కష్టం మీదనే పదెకరాలు సంపాదించి సాగు చేసిన నిఖార్సైన రైతు ఆయన.

పొద్దంతా కాయకష్టం చేసుకొని, పొద్దుగూకిన వేళ బీద, బిక్కి, బడుగు జనాలను పోగేసి 'మాక్స్ మహనీయుడెన్నడో దారి చూపే.. ఓ సామ్రాజ్యవాద తొత్తులారా.. మీ మాటలు సాగవనుచు గర్జించె సుందరయ్య' అని రాగం అందుకుంటే విప్లవమే గజ్జెకట్టి నర్తించినట్టుండేది. ఆ గర్జనకు మా ఊరి దొరగడీ వణికేది. ఇంకో పదేండ్లు పెదనాన్న బతుకుతాడని అనుకున్న. కానీ, అనుకోకుండా తుదిశ్వాస విడిచారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డితో సహా ఎర్రజెండా కామ్రేడ్స్ అంతా వచ్చి పాడె మోసింద్రు. కమ్యూనిస్టుగా, కర్షకునిగా, గీత కార్మికునిగా ఆయన నడిపిన ఉద్యమాలను అందరూ స్మరించారు. నివాళులు అర్పించారు.

దహన సంస్కారం చేసిన అనంతరం పాలోళ్లంతా స్నానం చేసి, ఇంటి వాకిట దీపం చూడటం ఆచారం. పుణ్య క్రియలన్నీ ఆచరించి, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చటమే పాలోళ్లుగా మేం ఆయనకిచ్చే ఘనమైన నివాళి. దహన సంస్కారం ముగిసింది. స్నానం చేద్దామని బోరు బావి దగ్గరకు వెళితే త్రీఫేజ్ కరెంటు లేదు. మా సోదరుడు ఓ పత్రికలో స్థానిక విలేకరి. ఏఈకి ఫోన్ జేస్తే కరెంటు కోత ఉందని ఆయన అన్నడు. రిక్వెస్ట్ మీద ఓ అర్ధ గంట పాటు కరెంటు వదిలిండు. ఈ తతంగాన్నంతా చూసి 'తుంటను దించుకొని మొద్దు ఎత్తుకున్నట్టయింది మన బతుకులు' అన్నడు మా చిన్నాన్న. ఆయనకు ఎద్దే ప్రపంచం. ఎవుసమే సర్వస్వం. ఏ రాజకీయ పార్టీ భావజాలం అంటని మనిషి. కేసీఆర్ పదేండ్ల పాలనలో జనం మొహం మొత్తి సరికొత్త పాలనను కోరుకోవడంలో అర్థం ఉంది. కానీ, రెండు నెలల పాలన.. కేవలం రెండే రెండు నెలల కొత్త ప్రభుత్వంపై ఏమిటి పెదవి విరుపు? సహజంగానే సందేహం నా మదిని తట్టింది. అప్పుడే అంత మాట అంటివెందే చిన్నాన్న అని అడిగితే కరెంటు కష్టాల మూట విప్పిండు.

'సాయంత్రం ఐదింటికి కరెంటు తీస్తరు. తెల్లవారుజామున మూడు గంటలకు ఇస్తరు. తెల్లారంగ రైతులందరం బావులకాడికిపోయి మోటర్లు ఆన్ జేస్తే ఓవర్‌లోడ్ పడి బోరు మోటర్లు కాలిపోతున్నయి' అని బాధపడ్డడు. ఇదే కర్విరాల కొత్తగూడెంలో ఒకేరోజు నాలుగు బోరు మోటర్లు కాలిపోయాయట. నెల రోజుల్లో 15 మోటర్లు కాలాయట. ఎవరెవరి మోటర్లు కాలిపోయాయో! గుక్క తిప్పుకోకుండా పేర్లన్నీ చెప్పిండు.

> మా చిన్నాన్న చెప్పున్న కరెంటు కష్టాలు రాష్ట్రంలో ఎక్కడైనా ఉన్నాయా? ఒక్క మా ఊరులోనే ఇట్లా జరుగుతుందా? అని గూగుల్‌లో వెదికితే ఆశ్చర్యకరంగా పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం నాగారంలో అచ్చంగా ఇటువంటి సంఘటనే జరిగినట్టు కనిపించింది. చేతిలో కుమ్మిసట్టి, నుదిటిన వీర బొట్టు, మెడలో దండ వేసుకొని, దహన సంస్కారాలు చేయాల్సిన వ్యక్తే విద్యుత్తు అధికారులకు ఫోన్ చేస్తూ.. పుణ్య స్నానాలు ఆచరించే వరకు కరెంటు ఇడువాలని వేడుకుంటున్న దృశ్యంతో ఓ వార్త కనిపించింది. ఇట్లా అడగటం కూడా పెద్ద నేరమే అయింది. కరెంటు అడిగినందుకు పాలకులకు కోపం వచ్చింది. బాధితుని మీద కన్నెర్ర జేసింద్రు. అనుచరగణాన్ని ఉసిగొలిపి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించింద్రు. దీనిపై ప్రస్తుతం కమాన్‌పూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇటువంటి సంఘటనలు తెలంగాణ ప్రజలకు కొత్తేమీ కాదు. ఉమ్మడి రాష్ట్రంలో ఇంతకుమించిన నరకాన్ని ప్రజలు చూశారు. నీళ్లింకిన బోర్లను చూసి కన్నీళ్లతోనే కాలమెల్ల దీసిన అనుభవం తెలంగాణది. చెరువులు ఎండిపోయి, బావుల్లో నీళ్లు లేక, రోజుల తరబడి కరెంటు రాక, పొట్టకొచ్చిన చేను వట్టిపోయి జనం మస్తు కష్టాలు పడ్డరు అప్పటి కాంగ్రెస్ పాలనలో. స్వరాష్ట్రం సిద్ధించినంక, నాడు ఆవరించిన చిమ్మ చీకట్లను చీల్చుకుంటూ సరికొత్త వెలుగులు రాష్ట్రంలోకి చొచ్చుకొచ్చాయి. ఎవుసానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తు అందింది. దానికి రైతుబంధు తోడైంది. దండుగ అనుకున్న వ్యవసాయం పండుగ అయింది. జీవనోపాధి స్థాయి నుంచి ఎదిగి సాంస్కృతికంగా మళ్లీ ఎవుసం పునరుజ్జీవం పోసుకుంది. పదేండ్ల నిరంతర కరెంటు, రైతుబంధుతో రైతు సేతానం.. పతానం మారింది. నిరంతర కరెంటు, రైతు భరోసా చుట్టూ రైతు గమనం అల్లుకుపోయింది.

ఈ ప్రపంచంలో ఏ రెండు పుర్రెలు ఒకే తీరుగా ఆలోచనలు చేయవు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలతో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి విభేదించారు. ప్రజలు కూడా రేవంత్ రెడ్డి ఆలోచనతోనే ఏకీభవించారు. కాబట్టే, కాంగ్రెస్ పార్టీకి పట్టం గట్టారు. 24 గంటల పాటు నిరంతరం కరెంటు సరఫరా చేయడం వల్ల వృథా జరుగుతోందనేది రేవంత్‌రెడ్డి ఆలోచన. అందుకే అధికారంలోకి రాగానే ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టారు. దీంతో కాంగ్రెస్ రాకతో పాటే రైతుల జీవితాల్లోనూ 'మార్పు' మొదలైంది. నిజమే..! కొంత వృథా ఉంటే ఉండవచ్చు. కానీ, పాలకులు నిర్ణయం తీసుకున్నంత సులువుగా సాగుబడి సరళి మారదు కదా. పదేండ్లుగా ఓ తరహా సాగుకు రైతన్నలు అలవాటు పడ్డారు. రాత్రికి రాత్రే సేతనం తీరు మారాలంటే ఎట్టా మారుతుంది. ఇక్కడే రైతుకు, రేషన్ తరహాలో ఇస్తున్న కరెంటుకు మధ్య సంఘర్షణ మొదలైంది. సాగు ఒడుదొడుకుల మార్పునకు లోనైంది. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రైతాంగం అనుభవించిన సంక్షేమ కాలాన్ని కూడా ప్రస్తుత ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలె. ఒక్కసారిగా ఊహించని కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్న కర్షకుల కష్టాన్ని అర్థం చేసుకోవాలి. ఎన్ని గంటల పాటు నాణ్యమైన, నిరంతరాయ కరెంటు ఇస్తారో.. ఎప్పటి నుంచి ఎప్పటి వరకు సరఫరా చేయగలరో ముందుగానే ప్రకటించాలి. ఆ మేరకు రైతులకు అవగాహన కల్పించాలి.

సాలిరువాలు సక్కగుంటేనే ఎవుసం ఒడ్డెక్కుద్ది. కరెంటు సాలు అయితే రైతుబంధు ఇరువాలు. ఇరువాలు ఇగురంగ దున్నకపోతే కలుపు పుడుతుందని రైతులు చెప్తారు. కొన్ని ఉదాసీనతలతో రైతుబంధులోనూ కొంత కలుపు, గరక కలగలిసిందని ప్రజాకవి గోరటి వెంకన్న మండలిలో చెప్పారు. ఇప్పటికైతే కొత్త ప్రభుత్వం రైతుబంధు పట్ల సానుకూలతనే ప్రకటించింది. ఆ మేరకు రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తూ వస్తున్నది. ఖజానాలో నిధుల లభ్యతను బట్టి విడతలు, విడతలుగా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్న మాట వాస్తవం. రైతుబంధు అందిన రైతులు డబ్బులు పడ్డాయనే చెప్తున్నారు. ఇంకా సాయం అందనివాళ్లు కొంత ఆందోళనతో ఉన్నారు. ఇటువంటి రైతులను ఎవరైనా మీడియా ప్రతినిధులు పలకరించినప్పుడు 'మాకింకా సాయం అందలేదు' అని వారు చెప్తున్నారు.

> అదే విషయం జర్నలిస్టులు ఓ మంత్రి వద్ద ప్రస్తావించగా.. 'రైతుబంధు పడలేదని అన్నవాళ్లను చెప్పుతో కొట్టండి' అని ఆయన బదులివ్వడం రైతాంగాన్ని భిన్నులను చేసింది. ఇటువంటి పౌరుషపు మాటలే రెండు నెలలు కూడా తిరగకముందే ప్రభుత్వాన్ని పలుచన చేస్తున్నాయి. 'కోరి తెచ్చుకున్నప్పుడు కొట్టినా పడాలె.. తిట్టినా పడాలె' అంటే జనం సహించరు. అన్నదాతలు ఎప్పుడూ పెట్టినవాళ్లను మనసారా ఆశీర్వదిస్తారు. కొట్టిన వాళ్లను మనసుల పెట్టుకుంటారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ప్రజా సంక్షేమం, అభివృద్ధినే ప్రజలు కోరుకుంటారు. ప్రజా ఆలోచనలకు అనుగుణంగానే పాలకుల నిర్ణయాలు ఉండాలె.

అధికారంలోకి వచ్చి రెండు నెలలే అయింది కాబట్టి, ఇదే విషయం ప్రజలకు వివరంగా చెప్పవచ్చు. 'ఆందోళన వద్దు, మేం ఉన్నాం' అని భరోసా నింపటానికి నాయకునికి ఇది తగిన సమయం. కానీ, విచక్షణ కోల్పోయి, అధికార మదం, పోలీసు బలం ప్రయోగిస్తామంటే జనం చరిత్రను తోడతారు. సరికొత్త చరిత్ర రాసేందుకు సన్నద్ధమవుతారు.

ముఖ్యమంత్రికీ శిక్షణ ఇవ్వాలేమో!

రచ్చ దినేష్
89787 40475

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలను వింటే ఆశ్చర్యమనిపించింది. 'రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక కూడా మారటం కష్టమే'నని భావించిన చాలామంది తమ అభిప్రాయం నిజమేనని ఈ మాటలతో నిర్ధారణకు వచ్చారు. 'అధికారంలోకి వచ్చి పదవీ బాధ్యతలు చేపట్టాక హుందాతనం, మార్పు వస్తుందిలే' అని భావించిన వాళ్లంతా తమ అంచనాలు తప్పాయని అనుకుంటున్నారు. రాజకీయాల్లో రేవంత్‌రెడ్డిలా దుందుడుకుగా విమర్శలు చేసేవారు చాలామందే ఉంటారు. కానీ, ఒక్కసారి అత్యున్నత పీఠాన్ని అధిరోహిస్తే చాలామంది తమను తాము సరికొత్తగా తీర్చిదిద్దుకుంటారు.

ఎదిగినకొద్దీ ఒదిగి ఉంటూ పది మందికి ఆదర్శంగా నిలుస్తారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పదవికి వన్నె తేవాలనుకుంటారు. అలా సందర్భానుసారం మారి, పేరు ప్రఖ్యాతులు సంపాదించినవాళ్లు చాలామంది ఉన్నారు. అయితే కొందరు తమ పద్ధతిని మార్చుకోకుండా, పదవికి మచ్చ తెస్తారు. అలాంటివారిని వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఎందుకంటే హోదాను మరిచి, పదవికి కళంకం తెచ్చేలా వ్యవహరించే వారు చరిత్రహీనులుగా మిగిలిపోయి, అందరికీ గుర్తుండిపోతారు కనుక. మన సీఎం కూడా ఆ కోవకే చెందినట్టున్నారు! తాను సీఎం అయ్యానని ఇప్పటికీ నమ్మకం కుదరక, ఆయన ఇంకా గతంలోనే విహరిస్తున్నారు. ఎన్నికల నాటి భాషనే పదే పదే వల్లె వేస్తూ అభాసుపాలవుతున్నారు. ఆయన భాషను చూసి సొంత పార్టీ నాయకులే తలదించుకుంటున్నారు.

రేవంత్‌రెడ్డి మాట తీరు, ఆయన భాషను చూసి చాలా మంది మేధావులు, బుద్ధిజీవులు కాంగ్రెస్ పార్టీకి ఇంత కష్టం వచ్చిందేంటని ఆవేదన చెందుతున్నారు. ఎందుకంటే, గతంలో ఆ పార్టీ గొప్పగొప్ప నాయకులకు నెలవు. సొంత పార్టీ నాయకులను మించి ప్రతిపక్ష నేతలను గౌరవించిన చరిత్ర కొంతమంది హస్తం పార్టీ నేతలకున్నది. తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్ష నేత వాజ్‌పేయిని ఎంతగా గౌరవించారో అందరికీ తెలిసిందే. అంతెందుకు ఇప్పుడున్న సీఎం బంధువైన జైపాల్‌రెడ్డి కూడా కాంగ్రెస్ నేతనే. ఆయన ఎంత హుందాతనం కలిగిన నేతనో మనందరం చూశాం. ఇలాంటి నేతలు కాంగ్రెస్‌లో కోకొల్లలు. ఇప్పటికీ కొంతమంది అలాంటి నాయకులు ఆ పార్టీలో ఉన్నారు. తన స్థాయిని మరిచి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డిని చూసి మేధావులు నివ్వెరపోతున్నారు. ఆయన మాటతీరును చూసి కాంగ్రెస్ పతనం మొదలైందని చర్చించుకుంటున్నారు.

> నిజానికి రేవంత్‌రెడ్డి మాట్లాడే భాష ఒక శాతం ప్రజలను మాత్రమే రంజింపజేస్తుంది. ఆ ఒక్క శాతం కోసం తెలంగాణ ప్రజలంతా విస్తుపోయేలా మాట్లాడటం చూస్తుంటే, ఏమిటీ వైపరీత్యమని బాధపడాల్సి వస్తున్నది. ఆయనలో ఒక నాయకుడికి ఉండాల్సిన లక్షణాల కన్నా దుందుడుకుగా వ్యవహరించే ఒక కార్యకర్తకు ఉండాల్సిన లక్షణాలు ఎక్కువగా ఉన్నట్టు అనిపిస్తున్నది. అందుకే సీఎం పదవి వచ్చాక కూడా అధిష్ఠానాన్ని మెప్పించేందుకే ఆయన ఇతర నాయకులతో పోటీ పడుతున్నట్టున్నారు.

కేసీఆర్ సహా ఆయన కుటుంబ సభ్యులను తిడితేనే పదవిలోకి వచ్చానని రేవంత్‌రెడ్డి గట్టిగా నమ్ముతున్నట్టున్నారు. ఆ క్రమంలో దక్కిన పదవిని కాపాడుకోవటానికి కూడా కేసీఆర్ కుటుంబాన్ని తిట్టటమే పనిగా పెట్టుకున్నారు. ఇది కేసీఆర్ అంటే నచ్చని వాళ్లకు కొన్ని రోజుల పాటు బాగుంటుంది. కానీ, రేవంత్‌రెడ్డిపై ఓ బాధ్యత ఉంది. ఆ బాధ్యతను నిర్వర్తించడం కేసీఆర్‌ను తిట్టినంత సులువు కాదు. సంక్షేమం, అభివృద్ధిలో కొత్త ఒరవడిని సృష్టించిన కేసీఆర్‌ను మించి పని చేస్తేనే తన కంటూ ఓ గుర్తింపు వస్తుందన్న విషయాన్ని మర్చిపోకూడదు. పరిపాలనాపరంగా కేసీఆర్ ఓ ట్రెండ్‌ను సెట్ చేశారు. తన కంటూ ఓ ప్రత్యేకతను సృష్టించుకున్నారు. ఆయనకంటూ ఓ ట్రాక్ రికార్డు ఉంది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఇతర రాష్ట్రాల వాళ్లు తెలంగాణ అభివృద్ధిని చూసి ఈర్ష్యతో ఆయనపై కోపం పెంచుకున్నారు. ఇప్పుడు మాత్రం నవ్వుకొంటున్నారు. తెలంగాణను చూసి జాలిపడుతున్నారు. ఎందుకంటే, దావోస్ పర్యటనతో తెలంగాణ భవిష్యత్తు ఏంటో వాళ్లకు కండ్లకు కట్టినట్టు కనిపించింది.

కొంతమంది రేవంత్‌రెడ్డి భాషను సమర్థించే క్రమంలో 'కేసీఆర్ గతంలో తిట్టలేదా?' అనే వాదనను ఎత్తుకుంటున్నారు. కానీ, కేసీఆర్ ఎప్పుడైనా తీవ్రమైన విమర్శలు, పదునైన మాటలు మాట్లాడారంటే, అది కచ్చితంగా తెలంగాణ ప్రయోజనాల కోసమేననే విషయాన్ని గుర్తెరగాలి. గతంలో మీడియాను పాతరపెడతానని అన్న సందర్భం అందరికీ తెలిసిందే. మొత్తం తెలంగాణ భాషను, యాసను, తెలంగాణ ప్రజాప్రతినిధులను కించపరిచే విధంగా కొందరు మాట్లాడటంతో ఆయన అలా కఠినంగా వ్యవహరించారు. తెలంగాణపై జరిగిన దాడిని చూసి ఆయన స్పందించిన తీరును తెలంగాణ సమాజం కూడా అంగీకరించింది. తెలంగాణను విమర్శిస్తూ, తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వారిపైనే ఆయన పదునైన భాషను ప్రయోగించారు. అలాంటివారినే వ్యంగ్యంగా విమర్శించారు. ఏ వేదికపై ఎలా మాట్లాడాలో కేసీఆర్ కంటే ఎక్కువగా ఎవరికి తెలుసు. తన ప్రవర్తన, హుందాతనంతో తెలంగాణ కీర్తిని మరింత పెంచిన వ్యక్తి కేసీఆర్. ఆయనతో రేవంత్‌రెడ్డి పోటీపడాలంటే అదయ్యే పని కాదు.

> తెలంగాణ ప్రయోజనాల కోసం కేసీఆర్ కఠినంగా మాట్లాడితే.. రేవంత్‌రెడ్డి మాత్రం తెలంగాణను సాధించిన వ్యక్తిపైనే నోరు పారేసుకుంటున్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసింది కొండంత అయితే.. రేవంత్‌రెడ్డి పాత్ర గోరంత కూడా లేదు. అలాంటి వ్యక్తిని చార్లెస్ శోభరాజ్‌తో పోల్చటం అత్యంత అభ్యంతరకరం. రేవంత్‌రెడ్డి భాషను మేధావులు, జర్నలిస్టులు, తెలంగాణ సమాజం అంగీకరిస్తుందా? కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఓ బీజేపీ నేత నోరుపారేసుకుంటే, మొదటగా ఖండించింది కేసీఆరే అనే విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలి.

అప్పుడు ఆయన కాంగ్రెస్‌లో లేరేమో. అందుకే ఆయనకు ఈ విషయం తెలిసుండదు. కాంగ్రెస్ పార్టీ మొత్తం దిగొచ్చినా 'కేసీఆర్ గొంతు పిసకటం, బీఆర్ఎస్‌ను బొందపెట్టడం' సాధ్యం కాదు. కేసీఆర్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి మాత్రమే కాదు. ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన పోరాటయోధుడాయన. ఆ విషయాన్ని రేవంత్‌రెడ్డి కూడా గతంలో అంగీకరించారు. తెలంగాణ ఉన్నన్ని రోజులు కేసీఆర్ పేరు చిరస్మరణీయం. ఆధునిక భారతంలో ఇలాంటి కీర్తి కలిగిన ఏకైక నేత కేసీఆర్. కాంగ్రెస్ అధిష్ఠానం తలుచుకుంటే రేవంత్‌రెడ్డి అనుభవిస్తున్న పదవులు రాత్రికి రాత్రే ఊడిపోతాయి. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి ఎవరంటే? ఎంతమంది గుర్తుపడతారు. అసలు కాంగ్రెస్ ముఖ్యమంత్రుల్లో ప్రజలకు గుర్తున్న పేర్లెన్ని?

కాంగ్రెస్ గెలవటంలో రేవంత్‌రెడ్డి పాత్ర ఎంతుందో తెలియదు గానీ.. ఇలాగే మాట్లాడితే కచ్చితంగా ప్రజాదరణకు ఆయనే దూరమవుతారు. అదే జరిగితే ఆయన గొంతు పిసకటానికి, ఆ పార్టీలోనే చాలా మంది రెడీగా ఉంటారు. వాస్తవానికి కొత్తగా ఎమ్మెల్యే అయిన వాళ్లకే అసెంబ్లీలో ఎలా ఉండాలనే అంశంపై శిక్షణ ఇస్తుంటారు. ముఖ్యమంత్రికి అటువంటి శిక్షణ అవసరం ఉండదు. ఎందుకంటే, ఆ స్థాయి వరకు వచ్చారంటే చాలా నేర్చుకొనే ఉంటారని అందరూ భావిస్తారు. కానీ, రేవంత్‌రెడ్డి భాష, మాటతీరును చూసిన తర్వాత భవిష్యత్తులో సీఎంలకు కూడా హుందాతనం, అసెంబ్లీలో ఎలా ప్రవర్తించాలన్న దానిపై శిక్షణ ఇవ్వాలనే ఆలోచన చేస్తారేమోనన్న అనుమానం కలుగుతున్నది. ఇప్పటికైనా ఒట్టి మాటలు కట్టిపెట్టి.. తెలంగాణ ప్రజలకు గట్టి మేలు తలపెట్టే కార్యక్రమాలు చేయాలి. లేదంటే 'ముఖ్యమంత్రి అంటే ఇలా ఉండకూడదు' అని భవిష్యత్తు తరాలకు పాఠాలు చెప్పేందుకు ఉదాహరణగా మిగిలిపోతారు.

> కాంగ్రెస్ పాలనలో తెలంగాణలోని పేదల బతుకులు ఆగమవుతున్నాయి. మరీ ముఖ్యంగా రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఓవైపు కరెంటు కోతలతో నానా అవస్థలు పడుతుంటే, మరోవైపు రుణాలు చెల్లించాలంటూ బ్యాంకులు నోటీసులు ఇస్తున్నాయి. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని పీసీసీ ప్రెసిడెంట్ హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో రైతులు కాంగ్రెస్‌ను గెలిపించారు. నమ్మినవారిని నట్టేట ముంచడంలో ఆరితేరిన కాంగ్రెస్ పాలకులు రుణమాఫీ చేయకుండా రైతులను ముంచి తమ పేరును సార్థకం చేసుకున్నారు.

రైతులను వేధిస్తున్న బ్యాంకులు

గుండమల్ల సతీశ్ కుమార్
94931 55522

డిసెంబర్ కాదు కదా, ఫిబ్రవరి 09 వస్తున్నా రుణమాఫీపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుబంధు ఇంకా పూర్తిస్థాయిలో అందరికీ అందలేదు. రుణమాఫీ కూడా పూర్తికాకపోవడంతో పెట్టుబడుల కోసం మిత్తికి తీసుకొచ్చిన నగదుపై రోజురోజుకు వడ్డీ పెరిగిపోతున్నది. రూ.500 బోనస్ చెల్లించి వడ్లు కొనుగోలు చేస్తామని, మ్యానిఫెస్టోలో ప్రకటించి ఇప్పుడు దానిపై సప్పుడు చేయడం లేదు. దీంతో కాంగ్రెస్ సర్కార్ అసలు రూపం బయటపడిందని రైతులు చర్చించుకుంటున్నారు. అధికారంలోకి వచ్చేందుకే అబద్ధాలు చెప్పారని మాట్లాడుకుంటున్నారు.

రైతుల వద్ద నుంచి రావాల్సిన బకాయిలను ముక్కుపిండి వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు అన్నదాతలపై ఒత్తిడి చేస్తున్నారు. 20 రోజుల కిందట రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ శాఖ అధికారులు, బ్యాంకర్లతో సమావేశమయ్యారు. రైతు రుణాలను రికవరీ చేయాలని, కట్టని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయి. అప్పటి నుంచి బ్యాంకు అధికారుల వేధింపులు మొదలయ్యాయి. 'మీరు కట్టకుంటే మా ఉద్యోగాలు పోతాయి' అని అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు.రుణమాఫీ చేసే